# 14

## గారడీ

ఊరుమొగనున్న రావిచెట్టు దగ్గర్నుంచి 'డమ్, డమ్' అన్న చప్పుడు వినిపించింది. 'గారడీవాళ్ళుకామోసు!' అన్నాడు గవరయ్య కాపు. ఆ వెంటనే పిల్లంగోవిపాటకూడా వినిపించింది. ఔను. వాళ్ళే!' అన్నాడు సర్వేశ్వర శాస్త్రిగారు.

పిల్లలంతా రావిచెట్టుకేసి పరుగెత్తేరు. పరుగెడితే బాగుండదనిపించి పెద్దలంతా చురుగ్గా నడిచారు. అంటగిన్నెలు తోముతూన్న రామి వాటిని అట్టే వదిలేసి తుర్రుమంది. చెముడు గల అన్నపూర్ణమ్మగారు పరిగెత్తిపోతూన్న జనాన్ని చూసి ఎక్కడో కొంప లంటుకున్నా యనుకుంది.

క్షణంలో గొప్ప గుంపుచేరి, గవరయ్యకి, "మన గ్రామంలో ఇంతమంది జనమున్నారా?" అనిపించింది. శాస్త్రి గారు, "అంతా వస్తే ఇంకా ఆశ్చర్యపోదువు! ఆ కోసవాళ్ళెవరూ రానేలేదు" అన్నాడు.

"ఎందుచేత?"

"ఇంకా ఉప్పు అందకే అనుకుంటాను. అంతేకాకుండా గ్రామం కోసని దెయ్యాల మఱ్ఱికింద కూడా ఒకమాటు వీళ్లు గారడీ చూపకుండా వెళ్ళరు. అప్పు డక్కడివాళ్ళంతా చూస్తారు."

గారడీవాళ్ళ నాయకుడు మామిడిటెంక సంచీలోంచి తీసి చూపిస్తూ, "ఇది ఇప్పుడే పాతి, మొక్క మొలిపించి, పండు పండించి, మీా అందరికీ కోసిపెడతాను" అన్నాడు. ఆలోగా జనంలో కలకలం బయల్దేరింది. గవరయ్యే, "మునసబుగారు! తప్పుకోండి" అని ఆ గ్రామాధికారికి దారిచేయించాడు. గారడీ నాయకుడు మునసబును చూసి 'దణ్ణాలు ప్రభువులకు!' అన్నాడు.

కరణంగారు పక్కనున్న షావుకారుతో 'చూశావుటోయ్ వీడి పొగరు? నాకు దణ్ణంపెట్టేడుకాదు!' అన్నాడు. షావుకారు ఒక్క అడుగు ముందుకేసి అందరికీ—ముఖ్యంగా గారడీవాడికీ—వినపడేటట్లు, 'దయచెయ్యండి కరణంగారూ!' అంటూ అంతకుముందరే అక్కడ దయచేసివున్న ఆ అధికార్ని పిలిచి, గారడీవానిచేత నమస్కారం పెట్టించాడు.

గారడీనాయకుడు తన ప్రదర్శనం కట్టిపెట్టి, 'దండాలు

పెట్టించుకోదలచినవాళ్లు ఇంకా ఎవరైనా ఉన్నారా?' అన్నట్లు ఒక్కమారు నలువంకలా పరికించాడు. ఊరికల్లా గొప్ప మీసం ఉన్న రాజుగారు, 'ఇటుచూడవోయ్!' అన్నట్లు అతణ్ణి ఆకర్షించి వందనం అందుకున్నారు. గవరయ్య, శాస్త్రిగారితో 'తమకి పెట్టేడు కాదేం?' అన్నాడు.

శాస్త్రి 'చూడు; పెట్టించుకు తీరుతాను' అన్నట్టుగా ఒక్క అడుగు ముందుకు వేసి, గారడీవాడితో, 'ఏమోయ్, నువ్వేమేమి విద్యలు నేర్చేవు? కనుకట్టు తెలుసా? ఇంద్రజాలం, మహేంద్రజాలం చూపగలవా?' అంటూ ప్రశ్నించాడు. 'బ్రాహ్మణోత్తములకు నా నమస్కారం' అన్నాడు ఐంద్రజాలికుడు. శాస్త్రిగారి కింక తన ప్రశ్నలకు బదులు అవసరం లేకపోయింది.

గారడీవాని మామిడిచెట్టు పెద్ద బంగినపల్లి పండు కాసింది. అతడు పండు కోసి ఎదురుగా నిలబడ్డవాళ్ళకి తలకొక ముక్క పెట్టేడు. పిల్లలంతా చేతులు చాపేరు. పెద్దలకు కూడా నోరు ఊరిందికాని పెద్దరికం అడ్డువచ్చి ఊరుకున్నారు.

అందరూ చూస్తోండగా గారడీవాడు తన భార్యని గోనె సంచీలో పెట్టి మూతి బిగించాడు. పదునైన బాకు తీసి సంచీని కసుకూ కసుకూమని పొడిచాడు. రామికీ అప్పుడు ఆ సంచిలో తన అత్తగారు ఉంటే ఎంత బాగుండిపోను అనిపించింది. సంచిలో కూచున్న మనిషి 'కుయ్యో, మొర్రో!' అనలేదు.

అందరూ ఆశ్చర్యంతో చూస్తో నిలబడేసరికి నాయకుడు దుఃఖం నటిస్తో, "ప్రాణనాయకీ, చనిపోయావా? నిన్ను నా

చేతులారా చంపేసుకున్నాను! నిన్నువిడిచి నేనింక ఒక్కక్షణం ఉండలేను!' అంటూ ఆ బాకుతో తనగుండెల్లో పొడిచేసుకో బోయాడు. ఆ క్షణంలోనే 'నాథా! ఆగు ఆగు! నీకోసం నేను తిరిగి బ్రతికేసి వస్తున్నాను!' అన్నమాటలు వినిపించాయి. అందరూ ఆవైపు చూసేసరికి గారడీవాని భార్య, రురుడికోసం బ్రతికివచ్చిన ప్రమద్వరకుమల్లే పరుగెత్తివచ్చి భర్తముందు వాలింది. అంతా చప్పట్లు కొట్టేరు.

గారడీవాడు చాలా గమ్మత్తులు చేశాడు. కుమారుణ్ణి వెల్లకితలా పడుకోమని, పొట్టపైన అరటికాయ పెట్టి, పొట్టకి గాయపడకుండా పదునైన ఖడ్గంతో కాయను రెండు తునక లుగా ఖండించాడు. నోట్లో చుట్ట పెట్టుకొని, వెనకపక్క వెలుగుతోన్న క్రొవ్వొత్తివైపు వంగి జుట్టు అంటుకోకుండా చుట్ట అంటించుకున్నాడు. ఒక్కొక్కటే చూసి, 'సెభాష్' అన్నారు మునసబుగారు. 'గొప్ప నైపుణ్యం!' అన్నారు కరణం గారు. 'బలే విద్యావంతుడు!' అన్నారు మీసనంపన్నులైన రాజావారు.

'అద్భుతంగా ఉంది లెండి!' అన్నారు శాస్త్రిగారు. 'ఇంకా అద్భుతాలు కనపరుస్తాను ప్రభువులకి. చూచి ఆనం దించండి. ఆనందించి, మీ జేబులో ఉన్నది, ఒక అర్ధ రూపాయ, లేకపోతే ఒక పావలా, లేకపోతే ఒక బేడ, అదీ లేకపోతే ఒక అణా, అర్ధణా, లేక కానీఐనా వేసి, ఈ పేద వానికీ, పెళ్ళాంపిల్లలకీ ఈనాడు కడుపునిండా భోజనం కలిగే టట్లు చెయ్యండి' అనేసి పిల్లంగోవి హాయిస్తో పింగాణీకంచం

ఒకటి పుష్యునికి చుట్టూ తిరిగేరు. రామి ఒక డబ్బు వేసింది. మునసబువెనకాల వచ్చిన వెట్టివాడొక కానీ వేశాడు. అలాగే కొన్ని కానీలు పడ్డాయి. మునసబుగారేమి వేస్తారో అనుకుంటూ వచ్చేసరికి ఆయన అక్కడ కనపడలేదు. ఆయన వెనకాలే వెళ్ళినట్లున్నారు కరణంగారు. 'యథా ప్రజా తథా రాజా' అన్నట్లు రాజాగారూ తక్కినవారితో బాటు నిష్క్రమించారు. వారిలో శాస్త్రి షావుకారుతో, 'ఏం వేశావోయ్ నువ్వు?' అన్నాడు. 'తమరేం వేశారో నేనూ అదేనండీ!' అన్నాడు షావుకారు.

"నేను తృణమో, పణమో వేసేవాణ్నే. కాని వాడు నాకు మొదట దణ్ణం పెట్టేడు కాదు."

"మీకు ఎప్పుడో అప్పుడు దణ్ణమంటూ పెట్టేడు. నాకు అసలు పెట్టనేలేదు. మీరు పణం వేస్తే వెయ్యొచ్చు గాని నేను తృణమైనా వెయ్యక్కర్లేదు."

## 2

మర్నాడు గ్రామంకొసనున్న దెయ్యాల మఱ్ఱికింద గారడీవాని షోలు వినిపించింది. తొలిరోజున చూపించినవాటికన్నా ఇంకా చిత్రవిచిత్రాలు చూపిస్తామంటూ వాడు తన బావమరిదిచేత ఆ ఉదయమే చాటింపు వేయించాడు. అందుచేత తొలినాడు రావిచెట్టువద్దకు వేంచేసిన పెద్దలంతా మలిరోజున మఱ్ఱిచెట్టుకింద గుమిగూడేరు.

గారడీవాడు గారడీ మొదలుపెట్టక బావమరిదితో ప్రసంగం ప్రారంభించాడు:

"ఓహోయి బావమరిదీ!"

"ఏమయ్యా?"

"రాత్రి మనం ఎక్కడ పండుకున్నామోయ్?"

"ఈ చెట్టుక్రింద నేనయ్యా, దెయ్యాల మఱ్ఱిక్రింద."

" 'దెయ్యాలు పీక్కుతింటయ్. ఇక్కడ పండుకోకండి' అని పెద్ద కాపుగారొకరు చెప్పినారు కదూ?"

"ఔను, ఐనా 'మాకు మంత్రాలు వచ్చుగా. దయ్యాలు దగ్గరకు రావు' అని నిర్భయంగా ఇక్కడే పండుకున్నాం."

"అప్పుడేం జరిగిందో, ఈ యావన్మంది జనానికీ మనవి చెయ్యవోయ్ మరిదీ."

"మహాజనులందరూ చిత్తగించండి! అర్ధరాత్రి అయే సరికి చెట్టుమీదనుంచి భూతములు, ప్రేతములు, పిశాచములు, శాకినీలు, డాకినీలు—అవేమిటి, ఇవేమిటి సమస్తమూ దిగి వచ్చి మమ్మల్ని చుట్టుముట్టేయి."

"ఔను. వాటిలో నాయకుడు కామోసు ఒక బ్రహ్మ రాక్షసి ముందుకువచ్చి యేమన్నాడు?"

" 'మీరంతా ఒకరి వెనకాల ఒకరు వరుసగానిలబడండి. దొంతరగా పట్టుకుని నమిలేస్తాను' అన్నాడు. అప్పుడు మనం, 'రాక్షసోత్తమా, ఆగు. మేము ఈరోజు భోజనం లేక శుష్కించి వున్నాము. మా మాంసం నీకు అంత రుచిగా వుండదు.' అన్నాం."

"ఐతే మరిదీ, మనం నిన్న ఎందువల్ల భోజనం చెయ్య లేదు?"

"రావిచెట్టుక్రింద ఆట చూచిన ప్రజ మన పళ్లెంలో భోజనాన్ని సంపాదించేటన్ని డబ్బులు వెయ్యలేదు గనుక."

సర్వేశ్వరశాస్త్రిగారు పావుకారుతో, 'చూశావు టోయ్, మనం డబ్బులువేశాంకాదని ఎలాగ టోంపుపాడు స్తున్నాడో ను!' అన్నారు.

'నేను వేసేవాణ్నేనండి. కాని తమరు వెయ్యకుండా నేను వేస్తే తమరు చిన్నబుచ్చుకుంటారేమో అని వెనకదీశాను' అన్నాడు పావుకారు. ఇంతలో గారడీనాయకుడు బావమరిదితో, "ఆతర్వాత యేం జరిగింది?" అన్నాడు.

" 'రాక్షసో త్తమా, మా మాంసం నీకంతగా రుచించదు. కాని మా విద్యవల్ల నీకూ, నీ పరివారానికీ వినోదం కలిగించ గలం' అంటూ వాళ్ళకి ఒక్కొక్క విద్యే ప్రదర్శించాము."

"బలే మెచ్చుకున్నారు కదూ?"

"చప్పట్లు కొట్టారు. ఆనందం పట్టలేక నాట్యం చేశారు కూడాను... కాని ఎన్ని గమ్మత్తులు చూపించినా పోక, 'ఇంకొకటి' 'ఇంకొకటి' అంటూ పీక్కుతిన్నారు."

"మనకి చిరాకేసుకొచ్చింది కూడాను."

"అందువల్లనే, 'ఇంక వెళ్ళండి' అని చెప్పి చూశాం.

మొదట పోయారు కాదు. 'కదలరేం? మంత్రాలు చదువుతాం!' అని బెదిరించాం; కదిలేరు కాదు. 'హ్రాం, హ్రీం, హ్రూం, ఫట్, స్వాహా' అన్నాం; లాభం లేకపోయింది."

"మరి ఆ భూతాలను ఎలా వదిలిపించుకోగలిగేం?"

"నీకే తోచింది ఆ ఆలోచన. ఉన్నట్టుండి డబ్బులడుక్కునే పింగాణీకంచం చేతబట్టుకుని ఒక్కొక్క భూతం వద్దకే వెళ్ళేవు! అర్ధా లేక పానలా. బేడ లేక అణా, అర్ధణా లేక కానీ అంటూ దగ్గరకు వెళ్ళేసరికి అంతవరకూ భూమిలో పాతుకుపోయిన చెట్లకుమల్లే నిలబడ్డ భూతాలన్నీ రెక్కలొచ్చిన పక్షులకుమల్లే ఇట్టే ఎగిరిపోయాయి! బలే ఆలోచనయ్యా బావయ్యా నీది! నీకు ఎలా తట్టిందీ అని ఇప్పుడుకూడా ఆశ్చర్యపోతున్నాను."

"ఆశ్చర్యాని కేముంది మరిదీ? ఏదైనా అనుభవమే. నిన్న రావిచెట్టువద్ద చుట్టూ మూగిన జనం మన పళ్ళెం చూచేసరికి ఇట్టే చెదిరిపోయారు! బ్రతికున్న మనుష్యులకే వెయ్యాలని బుద్ధిపుట్టనప్పుడు, చచ్చి దెయ్యాలైనవాళ్ళకి ఆ ఔదార్యం ఎక్కడుంటుంది గనక? అందుకే మన పళ్లెం చూపేసరికి అది భూతాలకి వీరాంజనేయంలాగ పనిచేసి, పరుగెత్తించింది."

మునసబుగారు, "ఈ సొద ఏదో పెట్టుకూర్చున్నారేమర్రా, ఆట చూపక?" అని చిరాకుపడ్డారు. "వీళ్ళ కీవాళ

మొదట్నుంచీ డబ్బిచ్చి పట్టుకుందండీ''అన్నారు కరణంగారు. "డబ్బుటర్రా శాశ్వతం, కీర్తిగాని? విద్య కనపర్చి కీర్తి గడిం చండి" అన్నారు శాస్త్రిగారు! "వరహా కిమ్మతు మాట సెలవిచ్చారు శాస్త్రిగారు." అని మెచ్చుకున్నాడు షావు కారు. నాయకుడు పళ్లెంపుచ్చుకుని షావుకారుముందుకు ఉరికి, "సెట్టిగారూ,ఉత్తిమాటలోనే వరహాకిమ్మత్తు కనపడింది తమకి! నా ఆటలో కనపడ్డ విలువేదో నాకెంయాపంగా ఈ పళ్ళెంలోకి జారవిడవండి!" అన్నాడు. "వెయ్యండి, చూస్తా రేం?" అన్నాడు వెట్టివాడు.

షావుకారు గొంతుకకు వచ్చి వెలకాయ అడ్డినట్లైంది. 'చిల్లర లేదు!'అన్నాడు చచ్చిపోతూన్నవానికిమల్లే. "ఏముంటే అదే వెయ్యండి. ఎంతవేసినా ఒక్కబేరంలో కూడదీసుకో గలరు" అన్నాడు వెట్టివాడు. షావుకారు చేసేదిలేక అర్ధ రూపాయకాసు పళ్ళెంలో పడేసి, గ్రామనౌఖరుతో,"ఒరేయ్, నీకు మహాపొగరుగా ఉంది. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా వాగుతున్నావు. నాచేత వేయించావుగాని మునసబు కరణాలచేత వేయించగలిగేవా?' అని తన ఉడుకుబోతుతనం కక్కేడు.

మునసబుగారికి రోషంవచ్చి,"మేంమాత్రం వెయ్యమా? అంత నువ్వొక్కడివేనా మొనగాడివి" అంటూ, వసూలుచేసి

జేబులో ఉంచుకున్న గవర్నమెంటు పన్నులోంచి ఒకరూపాయ తీసి గారడీవాడికి గిరాటు వేశాడు. కరణంగారూ ఇవ్వక తప్పింది కాదు. శాస్త్రిమాత్రం గారడీవాడు దగ్గరకువచ్చి దణ్ణంపెట్టే సరికి, 'దీర్ఘాయుష్యమస్తు!' అన్న ఆశీర్వాదంతో సరిపెట్టేడు.

గారడీవాడు ఆయన్ని దాటి వెళ్ళిపోయాడు. కాస్సేపటికి మీసాలరాజుగారు వెనకనుంచి వచ్చి, "శాస్త్రులుగారూ, ఒక్కరూపాయ బదులివ్వండి!" అని మెల్లిగా తొందరచేసి ఎవరూ చూడకుండా చేతిలో వేయించుకుని, నలుగురూ చూస్తోండగా గారడీవాణ్ని వెనక్కి పిలిచి అందరికీ కనపడేట్టు పళ్ళెంలో పడేశాడు. ఖంగుమని చప్పుడుచేసిందా రూపాయి. శాస్త్రికి అదేదో చెపుతూన్నట్టయింది. "శాస్త్రీ, నీ చేత్తోనే నన్ను ఇచ్చుకోనివుంటే నీకే కీర్తి దక్కివుండేదికదా! ఇప్పుడో, రాజావారికి దక్కిందా కీర్తి! ఈ అప్పు వసూలౌతుందనుకుంటున్నావేమో! భ్రమ!" అంది!